నాలుగు రోజుల తరవాత రెడ్డియార్ కార్లో సన్నాసితో సహా పింగరా అందరూ దిగారు. పాండిచ్చేరీ నించి. కారుదిగుతుండగా కుమారి మోచనీదేవి, రెడ్డియార్ సంచుల్లా వాలిన బుగ్గల్ని ఆప్యాయంగా పిండటం చౌదరి కళ్ళారా చూశాడు.

ఆ తరవాత అతివేగంగా వచ్చేశాయి పరిణామాలు. పట్టయ్య చౌదరి అల్లుడిమీద దావావేసి, ఆస్తికంతకీ, పిల్లల తరఫున తన కూతుర్ని గార్డియన్ పెట్టించాడు.

ఈ దావాకీ, సన్నాసి మీద కేసు రద్దు చేయించడానికీ చౌదరి దగ్గరున్న తక్కిన సొమ్ము కర్చైపోయింది.

చౌదరి కారులో కొన్ని ముఖ్యమైన సామానులు, కారు మాజిస్ట్రేటు కోర్టులో ఉండగా, పోలీసులు తీసేసుకున్నారని వదంతి. మిగిలిన కారు ఒక ధర ఇచ్చి రెడ్డియార్ కొనేశాడు.

వచ్చిన డబ్బులో సుందరం, తన కమీషను పోగా, మిగతాది తన జీతంకింద జమ కట్టుకున్నాడు.

ఇహ--

రెడ్డియార్ ప్రతి రాత్రి 7 గంటలనుంచి, 9 గంటలవరకూ "ఆఫీసు" లోనే మకాం. ఆ తరవాత "ఆఫీసు" నీ మిగతా హంగుల్నీ రతి ఎవరెల్లా వాడుకున్నా ఆయనకేమీ అభ్యంతరం లేదు. నెలకీ రెండువేలు కుమారి మోచనీ కిస్తాడు. అది ఎల్లా ఖర్చుపెట్టుకున్నా అతనికి అభ్యంతరం లేదు.

క్రమక్రమంగా ఆఫీసుకి- రెడ్డియార్ లేనప్పుడు- యజమాని ఎవరన్న విషయమై సన్నాసికీ, చౌదరికీ, ప్రచ్ఛన్న యుద్ధం ప్రారంభమైంది. అది తీవ్రరూపం దాల్చకుండానే సన్నాసి తన ఆధిక్యం నిరూపించుకున్నాడు.

"పోనీ మీ వూరెల్లి పోయొచ్చేయండి బావగోరు" అంది కుమారి మోచనీ, ఎంతో జాలిపడుతూ.

"నా పెళ్ళాంమీద అప్పీలుజేసి, ఆస్తి వశపరచుకుని, పిక్చర్‌తీసి పారెయ్యాలి. అప్పుడింటి కెళ్ళాలి' ' అన్నాడు చౌదరి.

ఈ లోగా రోజుకి రెండు రూపాయలు ఆయన ఖర్చుకింద సర్దుతోంది కుమారి మోచనీ.

రెడ్డియార్ మద్దతుతో పట్టుబడకుండా, పాండిచ్చేరీ నించి గ్రేప్ బుడ్ల దిగుమతి నిరాఘాటంగా సాగిస్తూ పెద్దవాడై పోయాడు సన్నాసి.

ఏ మాట కా మాటే చెప్పుకోవాలి. కుమారి మోచనీకి, చౌదరంటే ఎంతో ఇది- అది జాలనండి. అభిమాన మనండి. కృతజ్ఞత అనండి. ప్రేమనికూడా అనండి.

చౌదరి కథకోసం వెతుకుతూ పాండీబజార్లో తిరుగుతున్నాడు- సినీమా కథకోసం.

బ్రహ్మశ్రీ తడుపరి రాసిన జాబులో- "మిత్రమా, కథకోసం అంతగా వెతకడం ఎందుకు? నీ కథ అద్భుతంగా ఉంటుంది- సినీమాకి. నా మాట విని అది నిర్ణయం చెయ్యి." అని రాశాడు. అయినా బ్రహ్మశ్రీ మీద చౌదరికి కోపం రాలేదు- ఉక్రోషమో, ఆవేదనో, కంగారో తెలీకుండా అది చదువుకుని పకపక నవ్వుకున్నాడు.

యథాప్రకారం సుబ్బులుతో కలిసి పెసరట్లు తింటూ కథకోసం అన్వేషిస్తూ కాలం గడుపుతున్నాడు చౌదరి. కథ దొరకగానే, తనే పెళ్ళాం దగ్గరకెళ్ళి ఓ రాత్రి ఖుషామత్ చేసి, కావలసిన సొమ్ము తేవచ్చుననీ. దాంతో పిక్చర్ తీసి తన జన్మ సఫలం చేసుకోవచ్చుననీ, ఆఖరికి అంతా సుఖాంతం అవుతుందనీ అతని ఆశ. అయితే కథ దొరకాలి ముందు- మంచి కథ.



# మొదటి మాటలు

బుచ్చిబాబు

పువ్వు పుట్టగానే పరిమళించవచ్చు గాని, గొప్పవాళ్లు పుట్టగానే వారి గొప్పదనం గుబాళిస్తుందా?

గొప్పవాళ్లు పుట్టగానే మాట్లాడగలిగితే ఏం మాట్లాడివుంటారో, అలాగే వాళ్లు చనిపోయేక్షణంలో ఏం మాట్లాడి వుంటారో ఊహించి వ్రాయడం ఒక సారస్వతక్రీడ. ఈ క్రీడలో విశేషమేమిటంటే, ఒక్క వాక్యంలో ఆ ప్రముఖుల జీవితంలోని విశేషమంతా వ్యక్తం కావాలి.

తెలుగు రచయితలలో ప్రసిద్ధులైన కొందరి మొదటి మాటలను ఊహించి వ్రాసిన వాటిని ఈ చిన్నవ్యాసంలో పొందుపరుస్తున్నాను. ఈ విధంగానే ప్రముఖుల చివరి మాటలుకూడా ఊహించి వ్రాయొచ్చు.

ఉదాహరణకి:

కందుకూరి వీరేశలింగం: "ఒక్క వెధవని వుండనివ్వను-- స్వర్గంలో."

గిడుగురామమూర్తి: "నేను మరణించు మంటినని ఏప్రజయున్‌దలంప నవసరంబులేదు-అని అనను. నేచస్తున్నా. దగ్గరగారా, చెవులో చెప్ప- పైన అరసున్న లుంటాయా?"

గురజాడ: డామిట్, కథ అడ్డంగాతిరిగింది.

వేమన: మనరవేమా.

ఉన్నవ లక్ష్మీనారాయణ: అక్కడ 'బ్రాహ్మణ అగ్రహారం' వ్రాయాలి.

కాళిదాసు: మేఘాలమీదనే మనం వెళ్ళడం?

రామిరెడ్డి: 'చిమ్మ చీకటి నొంటి చిక్కుకొనియుంటి!'

నండూరి సుబ్బారావు: ఆరిపోయవె దీపము.

బాపిరాజు: పోవోయిసిన్నవాడా.

సజీవులైన వ్యక్తుల చివరిమాటలు మన సంప్రదాయం హర్షించదుగావున ఈ శీర్షికలో మొదటిమాటలు మాత్రం వుంచాను.

ఇక కొందరి మొదటిమాటలు. రాయప్రోలు సుబ్బారావు; "అ-ఆ-ఇ ఈ-ఉ-ఊ" (పుట్టగానే ఆయన ఏడుపు.)

దీనికాధారం:

"ఏ ప్రఫుల్ల పుష్పంబుల నీశ్వరునకు - పూజసల్పితినో ఇందు పుట్టినాడ - కలదయేని పునర్జన్మ కలుగుగాక- మధుర మధురంబయిన తెన్గు మాతృభాష"

విశ్వనాథ సత్యనారాయణ: (మంత్రసానిని సంబోధిస్తూ.)

"ఓహో కిన్నెరసాని!"

(జననం శీతాకాలంలో అయితే)

"హా హా హూ హూ"

మునిమాణిక్యం: "మనం ఇంకా ఇరవయేళ్ళదాకా చీర కొనక్కర్లేదు - కాంతానికి."

చలం: (మంత్రసానితో) పో, లేచి పో, డాక్టర్‌తో.

మొక్కపాటి: "బార్ - బార్ - బార్" (అని ఏడుపు) మూలం. బారిష్టర్ పార్వతీశం.

నండూరి సుబ్బారావు: "ఎనక జల్మములో ఎవరమో"

ఉన్నవ లక్ష్మీనారాయణ: (చుట్టూ చూసి, "ఏమిటీ మాలపల్లి?")

భమిడిపాటి కామేశ్వరరావు: "ఎప్పుడూ ఇంతే"

కృష్ణశాస్త్రి: "వెక్కి వెక్కి రోదింతును విసుపులేక- ఏడ్వలేక ఏడ్వలేక ఏడ్చుచుంటి."